2న ఎపిటిడబ్ల్యుటియు సమావేశం

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సంఘం (ఎపిటిడబ్ల్యూటియు) ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం జూలై 2న ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు బి.శ్రీనివాసుదొర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి సిఎహెచ్ స్కూల్లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లా శాఖ ప్రస్తుత కార్యవర్గం కాలపరిమితి ముగిసినందున నూతన కార్యవర్గం కోసం ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంఘ సమీక్ష, భవిష్యత్తు కార్యాచరణ, తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎపిటిడబ్ల్యూటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.సూర్యనారాయణ, జి.శేషగిరిరావు, అసోసియేట్ అధ్యక్షులు పి.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాసపడాల్ హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పనిచేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు హాజరవ్వాలని కోరారు.

గిరిజనులకు రేషన్ కష్టాలు

- సరుకులు మోసుకుని గ్రామాలకు..- ఇంటి వద్దకు రాని వాహనం

ప్రజాశక్తి-హుకుంపేట: రహదారి సౌకర్యం లేక గిరిజనులు కాలిబాటన రేషన్ సరుకులు మోసు కుంటున్నారు. ప్రభుత్వాలు మారినా రహదారి సౌకర్యం లేక గిరిజనులకు కష్టాలు తప్పలేదు. మండలంలోని తీగలవలస పంచాయతి పనసభంద, కిన్నెరలోవ గ్రామ ప్రజలు శుక్రవారం తీగలవలస డిపో నుంచి పనసభంద గ్రామం వరకు రేషన్ సరుకులను మహిళలు గాడిదలపై మోసుకుని ఘాటి ఎక్కారు. గిరిజనులు మండుటెండలో కష్టాలు పడుతూ ఘాటీలో ప్రయాణం చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో తమ గ్రామానికి రేషన్ సరుకుల వాహనం రాక పోవడంతో లబ్ధిదారులే మండుటెండలో నెత్తి మీద మూటలు మోసుకుంటూ ప్రతినెలా రాకపోకలు సాగిస్తున్నారు.

ప్రభుత్వం ఇంటి వద్దకు రేషన్ సరుకులు పంపిణీ అంటూ ప్రకటనలు వరకు పరిమితం అవుతుంది. తప్ప మారుమూల గ్రామంలో మాత్రం పూర్తి స్థాయిలో అమలు కాలేదని పనసభంద గ్రామ ప్రజలు వాపోతున్నారు. రహదారి సౌకర్యం కోసం పలుమార్లు సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేసినప్పటికీ స్పందించి అధికారులు రహదారి మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం నత్త నడకగా సాగుతున్నాయి. పనులు చేపడుతూ మధ్యలో ఆపివేయడంతో

రేషన్ సరుకులు మోసుకెళ్తున్న మహిళలు

వర్షానికి కోతకు గురై రాకపోకలకు వీలు లేకుండా అధ్వానంగా మారింది. అధికారులు రహదారి సౌకర్యం కల్పించి రేషన్ సరుకులకు ఇంటింటికీ పంపిణీ చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి అంపరంగి బుజ్జిబాబు

గురుకుల కళాశాలల్లో సీట్లు పెంచాలి

ఎస్ఎఫ్ఐ నేతల నిరసన ప్రదర్శన

వినతి పత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని గురుకుల బాలికల, బాలుర కళాశాలలో సీట్లు పెంచాలని రెండవ కౌన్సిలింగ్ ద్వారా అందరికీ ఇంటర్ ప్రవేశం కల్పించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో ఎస్ఎఫ్ఐ నేతలు శుక్రవారం ఐటిడిఏ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందనలో గురుకుల సెల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి కె.ప్రభుదాస్ మాట్లాడుతూ, గతంలో కన్నా గురుకులాల్లో ఈసారి ఇంటర్ ప్రవేశానికి సీట్లు తక్కువ కేటాయించారని తెలిపారు. దీంతో దరఖాస్తు చేసుకున్న చాలామంది గిరిజన విద్యార్థులకు సీట్లు లభించలేదని చెప్పారు. ప్రతి ఏడాది గురుకులాల్లో ఇంటర్ అడ్మిషన్ల కోసం గిరిజన విద్యార్థులు తీవ్ర పోటీ ఎదుర్కొం టున్నారని చెప్పారు. ఈ ఏడాది సీట్ల తగ్గించడంతో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య ఎక్కువ ఉందన్నారు. దీంతో చాలామందికి గురుకులాల్లో ప్రవేశం దొరకలేదని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ఏడాదిలో బాలురు 1361 మంది దరఖాస్తు చేసుకోగా 840 మందికి మాత్రమే సీట్లు లభించాయని, బాలికలు 1660 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 450 సీట్లు మాత్రమే వచ్చాయని చెప్పారు. దరఖాస్తు చేసుకొని సీట్లు రాని విద్యార్థులు అందరికీ రెండో కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేసారు. ఈ సారి శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించామని, రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావు, జీవన్ కృష్ణ, వరహాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఇంటర్‌లో ప్రవేశం కల్పించాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీ గురుకుల కళాశాలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ఇంటర్‌లో ప్రవేశం కల్పించాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలికి లక్కు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు చాలామంది గిరిజన పిల్లలు హాజరై 60 మార్కులు పైబడి సాధించారని తెలిపారు. ఇందులో ఆదిమ జాతి పివిటిజి పిల్లలు కూడా ఉన్నారని, వారిలో పాడేరు మండలం పిల్లిపుట్టు గ్రామానికి చెందిన సిదరి వరుణ్ తేజ్ కు 80 మార్కులు, మఱ్ఱి సంజన కు 69, వి.లాస్యకు 69మార్కులు వచ్చాయని తెలిపారు. ఈ విద్యార్థులకు సైతం గురుకుల పాఠశాలలో సీట్లు రాలే దన్నారు. తక్షణమే ఈఎమ్ఆర్‌లో యాభై మార్కులు పైబడి వచ్చిన వారికి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏపీఆర్ కళాశాలలో బాలురు 1300లకు పైగా దరఖాస్తు చేసుకుంటే కేవలం 840 సీట్లు మాత్రమే కేటాయించారని, బాలికలు 1660 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 480 సీట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. ఈ సమావేశంలో పి.వరహాలు, మత్స్యరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

అసైన్డ్ భూముల పంపిణీకి సిద్ధం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో అసైన్డ్ భూముల పంపిణీకి సంబంధించిన వివరాలు జూలై నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని తహసిల్దార్లు, అటవీ అధికారులు, సర్వేయర్లు, విఆర్ఒలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, లబ్దిదారుల వివరాలు ఆన్లైన్ చేయడం, తప్పులను సిద్దడం, ఎవరి పేరున పట్టా అవసరం వంటి వివరాలు గ్రామ సభల ద్వారా సేకరించి, గ్రామాలలో విచారణ జరిపి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల జిల్లా ఇంచార్జ్ మంత్రి 2,550 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ పంపిణీకి ఆదేశించిన నేపథ్యంలో 45 రోజులలో వివరాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విఆర్‌ఓలు తప్పనిసరిగా సచివాల యాలలోనే పని చేయాలని, తహసిల్దార్ కార్యాలయానికి అవసరమైతే తప్ప వెళ్ల కూడదని ఆదేశించారు. జిల్లాలో నోటరీ అనేది లేదని, సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని మ్యుటేషన్లు, తదితర ధ్రువపత్రాలు జారీ చేయాలని సూచించారు. తహసిల్దార్లు డ్యూటీ సర్టిఫికెట్లను జారీ చేయరాదని ఆదేశించారు. తనిఖీలలో విధులకు సక్రమంగా హాజరు కానట్లు గుర్తిస్తే వారిపై చర్యలు తీసుకోడం జరుగుతుందని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే తహసిల్దార్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని, మూడు నోటీసులు అందుకున్న వారు క్రమశిక్షణా చర్యలకు భాద్యుల వుతారని స్పష్టం చేసారు. జిల్లాలో 2,265 సెల్ టవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలక్టర్ జే.శివ శ్రీనివాసు, సర్వే భూ రికార్డుల ఎడి మోహనరావు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు వి.అభిషేక్, సూరజ్ గనోరే, సబ్ కలక్టర్ శుభం బన్సాల్, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి

పోస్టుమార్టం నిర్వహించే వైద్యాధికారిని నియమించాలి

ప్రజాశక్తి -సీలేరు

చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి పూర్తిస్థాయి పోస్టుమార్టం నిర్వహించే వైద్య అధికారిని నియమించాలని, మృతదేహాలను తరలించడానికి నూతనంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలని జికె.వీధి మండలం ధారకొండ ఎంపిటిసి సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చింతపల్లి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించే పర్మినెంట్ వైద్యాధికారి లేక మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించేటప్పుడు అనేక ఇబ్బందులు గురవుతున్నట్లు చెప్పారు. ప్రమాదవస్తు మరణాలు సంభవిస్తే పోస్టుమార్టం నిర్వహించడానికి తమ గ్రామం నుంచి చింతపల్లి తరలించడానికి అంబులెన్స్ లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. తమ గ్రామాల నుండి చింతపల్లి తరలించాలంటే 50 కిలోమీటర్లు ఉంటుందని, ప్రైవేటు వాహన యజమానులు రూ.4000 నుంచి రూ.8000 వరకు కిరాయి డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న గిరిజనులు అంత డబ్బులు చెల్లించాలంటే తలకుమించిన భారంగా తయారైందని పేర్కొన్నారు. గాలికొండ పంచాయతీ సప్పర్ల పిహెచ్‌సిలో అంబులెన్స్ అందుబాటులో లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలు పొందాలన్నా, మృతదేహాలను తరలించాలన్నా చాలా ఇబ్బందులకి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి నూతనంగా వైద్యాధికారిని నియమించాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని బుజ్జిబాబు కోరారు. ఈ సమావేశంలో దారకొండ వైస్ సర్పంచ్ చంటిబాబు, గాలికొండ సర్పంచ్ కాకూరు బుజ్జిబాబు, ఎ.దారకొండ సర్పంచ్ మురల రామారావు తదితరులు పాల్గొన్నారు.



లాస్య సాహితికి అభినందనలు తెలుపుతున్న సిపిఎం నాయకులు

20న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు టౌన్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (పాడేరు) రాష్ట్ర నైపుణాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తారని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ స్పష్టం చేసారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో జెసి జె.శివశ్రీనివాసు, ట్రైనీ కలెక్టర అశుతోష్ శ్రీవాత్సవ, ఎస్‌డిసి వివిఎస్ శర్మ, ఐటిడిఎ ఎపిఒ వివిఎస్ ప్రభాకర్, డిఆర్ డిఎ పిడి వి.మురళి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సంగీత, డిఎస్ డిఒ, జి.ప్రశాంత్ కుమార్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ గౌరీ శంకర్ తో కలిసి శుక్రవారం జాబ్మేళా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, ఫెయిర్ ఫీల్డ్ మారియోట్, నవతా రోడ్డు ట్రాన్స్ పోర్టు, అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యూ, మోహన్ స్పిన్టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డెక్కన్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్, అరబిందో, స్మార్ట్ సర్వీసెస్ (పేటియం), ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీజ్(ఎస్ బిఐ, యూనియన్ బ్యాంకు) వైఎస్ కె ఇన్ఫోటెక్, కాగెస్ట్ ఇ. సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 10 వ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన యువత, ఐటిఐ, టిఎస్సీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఎంబిఎ చదివిన యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు పి.నవీన్ ఫోన్:9491786463ను సంప్రదించాలని సూచించారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిఒ

బాధితులతో మాట్లాడుతున్న సురేంద్ర

బాధితులకు పరిహారం చెల్లించాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గాలివాన బీభత్సానికి చెట్లు కూలిపోయి మూడు ఇల్లు ధ్వంసం అయిన బాధితులకు పరిహారం చెల్లించాలని ఏపీ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొత్తబల్లుగుడ పంచాయతీ సరనాయిగుడ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత,ూ ఆదివాసీ నిరుపేద పిటిజీ గిరిజనులు కష్టబడి కట్టుకున్న రేకుల ఇల్లులు ఈదురుగాలులకు వృక్షం పడి ధ్వంసం అయ్యాయన్నారు. ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయట పడ్డారన్నారు. ఇంట్లో ఉన్న రెండు 20 బస్తాలు ధాన్యం, నాలుగు బస్తాల చోళ్లు, టీవీ, బీరువా పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. అధికారులు స్పందించి నష్ట పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదు రోజులు గడిచిన అధికారులు చెట్లు తొలగించకపోవడం దారుణమన్నారు. గిరిజనులు చెట్టు తొలగించాలంటే కట్టర్స్ ఉండాలని, అంత స్థోమత వారికి లేదన్నారు. ఇంటి పై పడి ఉన్న వృక్షం వెంటనే తొలగించాడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొర్ర మగ్గన్న పాల్గొన్నారు.

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

విలీన మండలాల్లో విస్తృతంగా ప్రచారం, సమావేశాలు

నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శ్రీనివాస్

మాట్లాడుతున్న సిపిఎం విఆర్.పురం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

పోలవరం నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వరదల బారినుండి ప్రజల్ని కాపాడాలని, గ్రామం చుట్టూ నీరు నిల్వ ఉండే గ్రామాలను కూడా పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుండి నిర్వహిస్తున్న పోరుకేక మహాపాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు విలీన నాలుగు మండలాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి పాదయాత్ర ప్రాధాన్యతను వివరించి ప్రజలను సన్నద్ధం చేస్తున్నారు.

చింతూరు : పాదయాత్రను జయప్రదం కోరుతూ శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో సిపిఎం నాయకులు సమావేశాలు నిర్వహించారు. మధుగూరు గ్రామంలో జరిగిన సమావేశంలో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరం జూన్‌లో వచ్చిన వరదలకు మధుగూరు, సూరనుగొంది రెండు గ్రామాలు గ్రామాల చుట్టూ వరద నీరు చేరిందని తెలిపారు. అధికారులు ఫీల్డ్ స్థాయి సర్వేలు చేసి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టు ముంపు నీళ్లు చుట్టుముట్టిన గ్రామాలను కూడా పోలవరం ప్రాజెక్టు ముంపు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపు మండలాల ప్రజలు అనుభవిస్తున్న సమస్యలను రాష్ట్రం మొత్తం తెలియాలని ఉద్దేశంతో ఈ పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు పునరావాసం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు రాజులు, మనోజు, సీతారామయ్య, శేషు, నారాయణ సుందరయ్య, భీము లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : పోలవరం నిర్వసితులు 17 సంవత్సరాలుగా వరదల వల్ల ఇబ్బంది పడుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతరామయ్య, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. కూనవరం పార్టీ కార్యాలయంలో తాళ్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం కాపర్ డామ్ బ్యాక్ వాటర్ వల్ల మండలంలోని అనేక గ్రామాలు ముంపునకు గురై ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అయినా ప్రభుత్వాలు నష్టపరిహారం ఇవ్వకుండా కాంటూరు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావాసం, ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చిన తరువాతే గ్రామాలను ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. 1986, 2022 నాటి వరద ముంపు ఆధారంగా గ్రామాలను రీ సర్వే చేయాలన్నారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలని, గ్రామాలు ఖాళీ చేయించే నాటికీ 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులందరికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, కుంజా రాధ, నోముల సత్యనారాయణ, కొండా ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని ములకనపల్లిలో శాఖ కార్యదర్శి బంగారు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, నాయకులు పంకు సత్తిబాబు, తమ్మయ్య కన్నయ్య, నూనె రాముడు, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

'పోలవరం పోరుకేక' పోస్టర్ ఆవిష్కరణ

ఎటపాక : పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని నెల్లిపాకలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లిపాక నుండి విజయవాడ వరకు 15 రోజుల పాటు సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రలో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆకిశెట్టి రాము, పులుసు బాలకృష్ణ, ఇరపా సత్యం, అపకా సమ్మక్క, నక్కా సూరిబాబు, ఇమామ్, బ్రహ్మం, సరవయ్య, ఊకె బాబు, ప్రవీణ్, అశోక్, కన్నయ్య, మాటూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర జయప్రదానికి భూ పోరాట కమిటీ పిలుపు

ఎటపాక : మహాపాదయాత్రను జయప్రదం చేయాలని భూపోరాట కమిటీ కన్వీనర్ నక్కా సూరిబాబు పిలుపునిచ్చారు. తుమ్మల నగరం గ్రామం కొమురం భీం నగర్ ఇంటి స్థలాల పోరాట కమిటీ జనరల్ బాడీ సమావేశం సవలం రాము అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో నక్కా సూరిబాబు మాట్లాడుతూ 20న జరిగే పాదయాత్ర, ప్రారంభ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కదిలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బుద్దుల భద్రయ్య, ఇర్ప సత్యం, అపక సమ్మక్క, సోందే సుబ్బారావు, పెనుబల్లి అంజిబాబు, తాటి రమాదేవి, ఉయికె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

ఎంసెట్ ర్యాంకర్‌కు సిపిఎం అభినందనలు

ప్రజాశక్తి-కూనవరం

ఎంసెట్‌లో అత్యంత ప్రతిభ కనబరచి 7024 ర్యాంక్ సాధించిన మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన ఉప్పలపాటి లాస్య సాహితిని మండల సీపీఎం నాయకులు శుక్రవారం కలిసి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, కుంజా రాధ, కొండా ఈశ్వర్లు, తలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎంపిటిసి, ఇన్‌ఛార్జి సర్పంచ్ తదితరులు

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భగీరథ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కో ఆర్డినేటర్ స్వర్ణలత, బుజ్జి, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

20న కొండగోకిరిలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు

లోకుల గాంధీ ట్రస్ట్, నర్సీపట్నం అమ్మ హాస్పటల్ అధ్వర్యంలో ఉజ్వల మల్టీ రీఛార్జ్ వారి సహకారంతో ఈ నెల 20న మండలంలోని కొండగోకిరి గ్రామంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లోకుల రమేష్, అమ్మ హాస్పటల్ అధినేత డాక్టర్ జివి.రాజు, ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్న మురళీ కృష్ణ తెలిపారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గిరిజనుల అవసరాల కోసం మదర్ బ్లడ్ బ్యాంక్ వారితో కలిసి ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఐదుగురు వ్యక్తుల ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల మల్టీ రీఛార్జ్ అధినేత గౌరినాయుడు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న లోకుల రమేష్, డాక్టర్ జివి.రాజు, మురళీకృష్ణ

బ్యాగు లేకుండానే జెవికె కిట్లను అందజేస్తున్న ఎటిడబ్ల్యూ

అరకొరగా విద్యా కానుక కిట్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాఠశాలలు తెరిచిన రోజే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక అందజేస్తామన్న ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేకపోయింది. అల్లూరి జిల్లాలో వాస్తవానికి పూర్తిస్థాయిలో విద్యా కానుక కిట్లు రాకపోవడంతో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరుచుకున్న తొలిరోజు విద్యా కానుక కిట్లు అరకొరగానే పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. పాఠశాలలు తెరిచి ఐదు రోజులైనా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జగనన్న విద్యా కానుక వస్తువుల్లో బ్యాగులు సరఫరా కాలేదు. దీంతో శుక్రవారం పట్టణంలోని తలారిసింగి జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థులకు బ్యాగు లేకుండానే జెవికె కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు మండల ఎటిడబ్ల్యూ ఎల్.రజని, పాఠశాల హెచ్ఎం రీమలి జాన్, ఉపాధ్యాయులు పి.కృష్ణారావు, ఆర్.సూర్యనారాయణ, కె.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

టిఎల్ఎం కిట్లను పంపిణీ చేస్తున్న ఐఇ కో-ఆర్డినేటర్ కె.భాస్కరరావు, తదితరులు

టిఎల్ఎం కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లోని గవర్నమెంట్ హైస్కూల్ ఆవరణలో గురు, శుక్ర వారాలు ఎస్ఐఐపిడి ఆధ్వర్యంలో ఐఇ జిల్లా కోఆర్డినేటర్ (సమగ్ర శిక్ష) కె.భాస్కరరావు అధ్యక్షత ప్రభుత్వ పాఠశాల బోధనోపకరణాల మేళాను అట్ట హాసంగా నిర్వహించారు. ఎస్ఐఐపిడి కోఆర్డినేటర్ జి.రామానాయుడు, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎం.మల్లికార్జున నాయక్ 62 మంది పేద, దివ్యాంగ పిల్లలకు టిఎల్ఎం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఇలాంటి కార్యక్రమం దోహద పడతా యన్నారు. ఉపకరణాలతో బోధిస్తే విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తిగా అర్థం కావడంతో పాటు వాటిని జీవితంలోనూ అన్వయించు కుంటారన్నారు. విద్యార్థుల్లో పాఠనాశక్తిని పెంచేలా టీచర్లు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 22 మండలాల్లోని ఐఇఆర్ పిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో బదిలీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్య ఆరోగ్య శాఖ జోన్ -1 కార్యాలయ పరిధిలోని ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. విశాఖపట్టణంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్ (మహిళలు)లో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ చేపట్టారు. గ్రేడ్-2 ఫార్మాసిస్టులు 12 మంది, ఆఫీస్ సూపరింటెండెంట్లు ఐదుగురు, స్టాఫ్ నర్సులు 84 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారని డీడీ శ్రీనివాస్ తెలిపారు. రీజనల్ డైరెక్టర్ ఎస్.ఉమాసుందరి, సూపరింటెండెంట్లు నిర్మలకుమారి, రామ్మోహన్ పర్యవేక్షణలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు శ్రీనివాస్ చెప్పారు.

'అవంతి'లో ఎంసిఎ కోర్సు

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంసిఎ కోర్సు ప్రారంభించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎపిఓ వి.ఎస్. ప్రభాకర్‌తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 135 అర్జీలను స్వీకరించారు. ఎపిఆర్ జేసి కళాశాలలు, గురుకులాలలు, ఆశ్రమ పాఠశాలల సీట్లు, తాగునీటి, రహదారుల నిర్మాణాలు, విద్యుత్తు సదుపాయాలు, అటవీ హక్కు పత్రాల పంపిణీ కోసం అధికంగా వినతులు అందాయి. ఈ సందర్భంగా స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

స్పందనలో స్వీకరించిన అర్జీలు

పాడేరు మండలం ఐనడవిధి పంచాయతీ ఐడిమెల కాలనీకి చెందిన కొర్ర వరలక్ష్మి, మజ్జి రత్నాలమ్మ, డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ తోటవలస గ్రామస్తులు జి. భాగ్యవతి, జి. అర్జున్ తదితర 20 మంది గిరిజన రైతులు అటవీ హక్కుపత్రాలు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. జి.మాడుగుల మండలం పెదలోవలి పంచాయతీ మెట్టపాడు గ్రామస్తులు పి.జగ్గారావు, వి.మహేష్ తదితరులు తియ్యమామిడి నుండి మెట్టపాడు గ్రామానికి రోడ్డు నిర్మించాలని దరఖాస్తును అందజేశారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ కూనారం గ్రామంలో ఉన్న రెండు పివిటిజి, భగత వీధులను అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మించాలని వార్డు మెంబరు పి. సంజీవ రావు, ఎస్. రాజేష్ అర్జీని సమర్పించారు.జి.మాడుగుల మండలం గడుతూరు సర్పంచ్ కె.అప్పలమ్మ సీతబంధ గ్రామం నుండి నిట్టమామిడి గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. డుంబ్రిగుడ మండలం కితలంగి పంచాయతీ దూదిగుడ గ్రామానికి విద్యుత్ వైర్లకు కర్రలు ఉపయోగిస్తున్నారని, విద్యుత్తు స్తంభాలు మంజూరు చేయాలని కె. నారాయణ, గిమ్మెలి నీలన్న కోరారు.కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ కుమ్మర, జాజుల బంద, ధార గెడ్డ, పాల మామిడి, పోర్లు బంద గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తుల వినతిపత్రం సమర్పించారు.అరకు వ్యాలీ మండలం చొంపి గ్రామానికి చెందిన శెట్టి వసంత జి ఎన్ ఎం నర్సింగ్ ఉత్తీర్ణత సాధించానని, కోవిడ్ -19 వైద్య సేవలందించాలని ఎఎన్ఎం ఉద్యోగం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఎస్.డి.సి, వి.వి.ఎస్ శర్మ, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్‌రావు, ఎల్‌డి ఎం.రవితేజ, డి.ఎల్.పిఓ, పి.ఎస్.కుమార్, ఐటిడిఏ పరిపాలనాధికారి హేమలత పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

టెండర్లు రద్దుకు వినతి

అంగన్వాడి కేంద్రాలలో నాసిరకమైన సరుకులు, 25 నుండి 35 గ్రాముల కోడి గుడ్లు సరఫరా చేస్తూ అవినీతికి పాల్పడుతున్న అంగన్వాడీ టెండర్లు రద్దు చేయాలని కోరుతూ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.రాధాకష్ణ శుక్రవారం స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. పెదబయలు, ముంచంగిపుట్టు, హుకుంపేట, డుంబ్రిగూడ, అరకు, అనంతగిరి, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి, మండలాల అంగన్వాడి కేంద్రాలకు టెండర్ల యాజమాన్యం నాసిరకమైన సరుకులు పంపిణీ చేస్తుందన్నారు.25 నుండి 35 గ్రాముల బరువు ఉన్న కోడిగుడ్లు అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేస్తున్నారన్నారు. కోడిగుడ్ల తూకం, సరుకుల నాణ్యత పరిశీలించిన తర్వాత అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉండగా ఆ విధంగా చేయలేదన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి ప్రేమికుల ఆత్మహత్య

ప్రజాశక్తి -అనంతగిరి: కొన్నేళ్ల పరిచయం ప్రేమగా మారి ఆత్మహత్యకు దారి తీసిన ఘటన మండలంలోని చోటుచేసుకుంది. గత మూడు సంవత్సరాల నుండి ప్రేమించుకుంటున్న ఆ జంట చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల కథనం మేరకు...తాడిగుడ గ్రామానికి చెందిన నందుల. చంద్రన్న, వాలసి పంచాయతీ చీమగెడ్డ గ్రామానికి చెందిన సేంబి . స్వాతిలు ప్రేమికులు. కేకే లైన్ నిమ్మలపాలెం వద్ద రైలు కింద పడి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే శాఖ పోలీసులు వెల్లడించారు. రైల్వే శాఖ పోలీసులు మృతదేహాల వద్ద లభించిన ఆధార్ కార్డు, ఫోన్ డేటా ఆధారంగా అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు సిపిఎం నాయకులతో కలిసి విజయనగరం రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరారు. మృతదేహాలను గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మూడేళ్ల నుండి ప్రేమలో..

అనంతగిరి పంచాయతీకి తాడిగుడ గ్రామానికి చెందిన నందుల. చంద్రన్న,వాలసి పంచాయతీ చీమగెడ్డ గ్రామానికి చెందిన సేంబి స్వాతితో గత మూడేళ్ల కాలం నుండి పరిచయం పెంచుకొని ప్రేమ వ్యాహారంగా మార్చుకున్నాడు. స్వాతి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కూడా అనంతగిరి లోనే పూర్తి చేసుకుంది. ఆ తర్వాత పెళ్లి చేసుకునేందు తన మొదటి భార్య రొద్దుతో చంద్రన్న విషయాన్ని చెప్పాడు. రొద్దు ఒగికరించ పోవడంతోనే గ్రామం నుండి ఈనెల 9వ. తేదీన శుక్రవారం చంద్రన్న,. స్వాతి కలిసి బయటకు వెళ్లినట్లు భార్య చెప్పింది. రైల్వే ట్రాక్ లో చంద్రన్న స్వాతి మృతి చెంది ఉన్నారని పోలీసులు తమకు సమాచారం అందించారని ఆమె చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన నందుల. చంద్రన్నకు నలుగురు పిల్లలు ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

గిరిజన చట్టాల అమల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన చట్టాలు, హక్కులు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర డెలిగేట్ మెంబరు పి చిన్నస్వామి విమర్శించారు.మండలంలోని అరకు సంత బయలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి, బిజెపి ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కే.భీమారావు, సురేంద్రరావు, సుబ్బారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక గురుకుల రెసిడెన్సియల్ బాలుర కళాశాల విద్యార్థి బైపిసిలో 950 మార్కులు సాధించి అరకు నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించాడని, అలాగే నీట్‌లో కూడా ప్రతిభ చాటాడని ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరమ్మ తెలిపారు.నీట్ అలిండియా ఎస్టీ కోటాలో 283 మార్కులు సాధించి 1,46, 51ర్యాంకు సాధించినందుకు కళాశాల తరుపున అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రానున్న ఎన్నికల్లో పాడేరు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క టిడిపి కార్యకర్త, ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కమిటీలు, సేవా మిత్రలు పని చేయాలని పాడేరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్, సేవ మిత్ర నియామకాలపై శిక్షణ తరగతులు, పార్టీ బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడిన ప్రతి ఒక్కరికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం చింతపల్లి మండలం ఇటములో పంచాయతీలోని 20 కుటుంబాలు, గన్నవరం పంచాయతీలోని 10 కుటుంబాలను పార్టీ కండువాలు వేసి పార్టీలో సాధారణంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టి సెల్ కార్యదర్శులు చిట్టిబాబు, సింహాచలం, రమేష్ నాయుడు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వెంకటరమణ (బుజ్జి) చింతపల్లి జి.మాడుగుల మండల అధ్యక్షులు పూర్ణచంద్రరావు, కొండలరావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, చిన్నారులు

విద్యుత్ భారాలపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విపరీతంగా పెంచిన విద్యుత్ ఛార్జీలపై శుక్రవారం సాయంత్రం పూర్ణా మార్కెట్ ప్రాంతం సత్యనారాయణ థియేటర్ వెనుక గాజులవీధిలో ఐద్వా, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రమణమ్మ మాట్లాడుతూ ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీలు సామాన్యులు మోయలేని భారంగా మారాయన్నారు. గతంలో రూ.300 వచ్చిన విద్యుత్ బిల్లు ఇప్పుడు రూ.700 వచ్చిందన్నారు. ఇప్పటికే తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు పనుల్లోకి వెళ్లలేకపోతున్నారని, దానికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, పిల్లలను స్కూలుకు పంపించే సమయంలో ఫీజులకు, పుస్తకాలకు అధికంగా డబ్బులు ఖర్చు పెడుతున్నారని.. ఈ పరిస్థితులలో విద్యుత్ ఛార్జీలు పెరగడం గోరుచుట్టుపై రోకలి పోటు పడిన విధంగా ఉందని వాపోయారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, బి.లక్ష్మి, కార్మిక నాయకులు అప్పారావు, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు ఝాన్సీ కుమారి, కనకమహాలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసిలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్, క్లాప్ డ్రైవర్స్, యుజిడి, వెటర్నరీ, వాటర్ సప్లయ్, పార్కులు తదితర కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్మికులు ఈ నెల 19 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. సుదీర్ఘకాలం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసి చనిపోయిన, 60 ఏళ్లు పైబడిన, లాంగ్ ఆప్సెంట్, సిక్ అయిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని అడుగుతున్నా జివిఎంసి అధికారులు అలా చేయకుండా నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేయడం సరికాదన్నారు. 482 పోస్టులను వారసులకు ఇచ్చిన తరువాత మిగిలిన పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. అలాగే క్లాప్ డ్రైవర్లకు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం నెలకు రూ.18,500 జీతం చెల్లించాలని, గత సమ్మె సందర్భంగా అంగీకరించిన మినిట్స్‌ను అమలు చేయాలని కోరారు. సమ్మె వల్ల ప్రజలకు అసౌకర్యం కలిగితే దాని పూర్తి బాధ్యత జివిఎంసి, రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్బంధం ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చూస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.

ఆగస్టు 6న ఆర్య వైశ్య వధూవరుల పరిచయ వేదిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆర్య వైశ్య వధూవరుల పరిచయ మహా వేదిక కార్యక్రమాన్ని ఆగస్టు 6న విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి నూకరాజు, పూసర్ల సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సామాజిక సేవలో భాగంగా ఏ విధమైన లాభాపేక్ష లేకుండా నగరంలోని ఆర్య వైశ్యులు అందించిన విరాళాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, ఉభయగోదావరి జిల్లాలతో పాటు, విదేశాలలో ఉంటున్న ఆర్యవైశ్యులు కూడా తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునేందుకు ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో కోశాధికారి గ్రంధి దుర్గాప్రసాద్, గ్రంధి రామకృష్ణారావు పాల్గొన్నారు.

చదువు సాగేదెలా..!

తక్కువ విద్యార్థులున్న యుపి స్కూళ్లలో సబ్జెక్టు టీచర్ పోస్టుల రద్దు
52 సూళ్లలో 200 పోస్టులు కనుమరుగు
ఎస్‌జిటిలతో విద్యాబోధన - ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

చోడవరం మండలం అడ్డూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మూడు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులు 73 మంది ఉన్నారు. ఆ పాఠశాలలో 98 మంది కంటే విద్యార్థులు తక్కువవుండడంతో జిఒ 117 ప్రకారం చేసిన రేషనలైజేషన్‌లో భాగంగా కొద్ది రోజుల క్రితం జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్ లెక్కలు, సోషల్, తెలుగు పండిట్ పోస్టులను ప్రభుత్వం రద్దుచేసింది.

అనకాపల్లి మండలం సుందరయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాలలో 78 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ కూడా స్కూల్ అసిస్టెంట్ సోషల్, లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు పండింట్ పోస్టులు రద్దయ్యాయి.

సబ్జెక్టు టీచర్లు రద్దయిన సుందరయ్యపేట ప్రాథమికోన్నత పాఠశాల

ఇదే పరిస్థితి విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని 52 ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకొంది. 98 మంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో దాదాపు 200కు పైగా వివిధ సబ్జెక్టులు బోధించే స్కూల్ అసిస్టెంట్ పోస్టులు లేకుండాపోయాయి. రకరకాల పేర్లతో పేదల ప్రభుత్వ పాఠశాలలను బలహీనపర్చి, ప్రయివేటు విద్యను ప్రోత్సహించే ప్రక్రియను ప్రభుత్వం బలంగానే చేస్తుందనడానికి దీనినొక ఉదాహరణగా చెప్పొచ్చు. గతంలో మూడు కిలోమీటర్లలోపున్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం విలీనం చేసింది. ఇప్పుడు మూడు కిలోమీటర్ల పైబడివున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ వుందని స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ పోస్టులను రద్దు చేసింది. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసినప్పుడు విద్యార్థులందరికీ సబ్జెక్టు టీచర్లు బోధన చేయాలని, అందుకనే మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేస్తున్నట్లు ఆనాడు ప్రభుత్వం నమ్మబలికింది. ఇప్పుడు మూడు నుంచి ఎనిమిది తరగతులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉందని సబ్జెక్టు టీచర్ పోస్టులు రద్దుచేసి మోసగించింది. విద్యార్థుల సంఖ్య తక్కువున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్‌జిటిలతో బోధన సాగించనుంది. భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందని పేద విద్యార్థులంతా మళ్లీ ప్రయివేటు పాఠశాలల వైపు దారులువెతుక్కొనే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే ఈ విషయమై విద్యాశాఖాధికారులు మాత్రం స్పందించడంలేదు.

యుపి పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి

98 మంది విద్యార్థుల కంటే తక్కువున్న ప్రాథమికోన్నత పాఠశాల (యుపి)లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను తీసేయడం సరికాదు. 98 మంది కంటే తక్కువవున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్‌జిటిలతో బోధించి, ఎక్కువ మంది వున్న పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో బోధించాలని ప్రభుత్వం నిర్ణయించడం న్యాయంకాదు. పేద విద్యార్థులు నష్టపోయే నిర్ణయాలను వెనక్కుతీసుకోవాలి. లేదంటే ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు తరలిపోయే ప్రమాదముంది. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి.

గొంది చినబ్బాయ్, యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రసన్న కుమార్‌కు డాక్టరేట్ అందజేస్తున్న విసి ప్రసాద్‌రెడ్డి

ప్రసన్న కుమార్‌కు ఎయు డాక్టరేట్

ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బోటనీ విభాగపు పరిశోధక విద్యార్థి మల్లారపు విజయ వెంకట ప్రసన్న కుమార్‌కు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రసన్న కుమార్ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. డిపార్టుమెంట్ ఆఫ్ బోటనీ ప్రొఫెసర్ ఆచార్య బి.సుజాత పర్యవేక్షణలో ఆయన పరిశోధనలు సాగాయి. 'ఎఫెక్ట్ ఆఫ్ కాడ్మియమ్ (సీడీ) ఆన్ కజానస్ కజాన్ (ఎల్) సోర్గమ్ బై కోలార్ (ఎల్) (సీ3 అండ్ సీ4) ఇన్ అండ్ ఎ రౌండ్ ది అగ్రికల్చరల్ ఫీల్డ్స్ ఆఫ్ విశాఖపట్టణం అండ్ ఇట్స్ కంపరేటివ్ రెస్పాన్స్ ఇన్ ఫిజియోలాజికల్ బయోటెమికల్ అల్ట్రా స్ట్రక్చరల్ అండ్ మాలిక్యులర్ స్టడీస్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను ప్రసన్న కుమార్ ఈ డాక్టరేట్ పొందారు.

ఎంపీ కుటుంబం కిడ్నాప్ కేసులో పురోగతి

పోలీసులకు చిక్కిన మరొక నిందితుడు
రూ.కోటీ 40 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రధాన నిందితుడు హేమంత్‌కు సహకరించిన మరొక కీలక నిందితుడు గాజువాక ప్రాంతానికి చెందిన రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి సహకరించిన మరొక నిందితుడు గాజువాక ప్రాంతానికి చెందిన సాయి కోసం ప్రత్యేకంగా గాలిస్తున్నట్టు అధికారులు తెలిపారు. కేవలం నగదు దోచుకునేందుకే ఈ కిడ్నాప్ పథకం రచించినట్టు వెల్లడించారు. గతంలో వీరు ముగ్గురు జైల్లో స్నేహితులయ్యారని, అక్కడే ఎంవివి.సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్ పథకం రచించారని తెలిపారు. గతంలో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ కిడ్నాప్ కేసులో జైలుకు వెళ్లగా, మిగిలిన నిందితులు సాయి, రాజేష్‌లు దొంగతనం కేసుల్లో జైలుకు వెళ్లారని తెలియజేశారు.

నగదు స్వాధీనం

ఈ కిడ్నాప్ ఘటనలో మొత్తం కోటీ 75 లక్షలను ఎంపీ భార్య జ్యోతి, కుమారుడు శరత్, ఆడిటర్ జివిల నుంచి కిడ్నాపర్లు తీసుకోగా అందులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ అతని స్నేహితురాలు సుబ్బలక్ష్మికి రూ.50 లక్షలు ఇచ్చాడని, అదేవిధంగా ఈ కేసులో బెయిల్ కోసం ముందుగానే లాయర్‌కు రూ.25 లక్షలు పంపించాడని పోలీసులు కనుగొన్నారు. అనంతరం వీరిద్దరి నుంచి రూ.75 లక్షలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో నిన్న హేమంత్ కుమార్ వద్ద స్వాధీనం చేసుకున్న రూ.85 లక్షలు కలుపుకుని మొత్తం కోటీ నలభై లక్షలను ఇప్పటి వరకూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.35 లక్షలు పరారీలో ఉన్న సాయి వద్ద ఉన్నాయని, అతడు దొరికితే మిగిలిన నగదు కూడా రికవరీ అవుతుందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా అమరావతిలో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి నిందితులు ముగ్గురిపైనా పీడీ యాక్ట్ నమోదు చేసి త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు చేపడతామని తెలిపారు

23 నుంచి పటిష్టంగా 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు సరికొత్తగా 'జగనన్న సురక్ష'కు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జోనల్ కమిషనర్లతో కలిసి జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా ఈ నెల 23 నుంచి జులై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, తహశీల్దార్ ఒక బృందంగా ఏర్పడి గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లాలన్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్లు ఒక బృందంగా ఏర్పడి వార్డుల్లో పర్యటించాలని, బృందం సందర్శించే గ్రామాన్ని ముందుగానే గ్రామస్తులకు తెలిపి సిద్ధంగా ఉంచాలని అన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి ఆ ఇంటికి సంబంధించి జనన, మరణ, కుల, వివాహ ధ్రువపత్రాలు నుంచి ప్రభుత్వ పథకాలను పొందడం దాకా ఏమైనా సమస్యలున్నాయా ? అని నిశితంగా పరిశీలించి ఆ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

నిర్దేశిత తేదీల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయాలను సందర్శించి అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అదే రోజు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిఆర్‌ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు భాస్కరరావు, హుస్సేన్ సాహెబ్, డిఎల్‌డిఒ పూర్ణిమా దేవి, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశం ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని బిజెపి నేత, మాజీ ఎంపీ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు శుక్రవారం సాయంత్రం బిజెపి జిల్లా కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.